ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పేజీలు : 5 | సంపుటి : 01 | - సంచిక 160 | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | గురువారం 12- 9 - 2024 | వెల - 2 | Digital Edition

## ప్రతి ఎకరానికి 10వేలు ఇస్తాం రైతులు అధైర్య పడొవద్దు సీఎం

**అన్ని విదాల ఆదుకుంటాం గత ప్రభుత్వ పాపాలే ఇప్పడు శాపాలయ్యాయి**
**బెజవాడను ముంచింది జగన్ అండ్ కోనే**
**ప్రకాశం బ్యారేజ్ ను కూల్చే కుట్ర కూడా వాళ్లదే**
**కొల్లేరు వరద ప్రాంతాలలో చంద్రబాబు పర్యటన**
**ఏలూరులో- రైతన్నలతో ముఖాముఖిపోలవరం పూర్తి చేస్తామని హామీ.**



ఏలూరు సెప్టెంబర్ 11(రిపబ్లిక్ న్యూస్) గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు మనకు ఇప్పుడు శాపాలుగా మారాయని సీఎం చంద్రబాబు ఆరోపించారు. బుడమేరు పట్ల నాటి సర్కారు వహించిన నిర్లక్ష్య ధోరణి విజయవాడకు ముప్పుగా పరిణమించిందని చెప్పారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా బుడమేరు పూడిక తీయలేదని, గండ్లు పూడ్చలేదని విమర్శించారు. దీంతో భారీ వర్షాలకు విజయవాడను కనీవినీ ఎరగని వరద ముంచెత్తిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏలూరు జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను నేడు ఆయన పరిశీలించారు. కొల్లేరు పరివాహక ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో తమ్మిలేరు వరద ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం కొల్లేరు, ఉప్పుటేరు, తమ్మిలేరు వరదలపై అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.

2లో




## ఆ 11సీట్లు కూడా ఎందుకు ఇచ్చామని ప్రజలు బాధపడుతున్నారు..



అమరావతి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరు చూసి ప్రజలు బాధపడుతున్నారని ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ 11సీట్లు కూడా ఎందుకు ఇచ్చామా అని ప్రజలు బాధపడే పరిస్థితిని ఆయన కల్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌కు ప్రతి విషయంలో అసత్యాలు చెప్పడం అలవాటుగా మారిందని మండిపడ్డారు. రాష్ట్రంలో వర్షాలు, వరదలతో ప్రజలు అల్లాడుతుంటే కష్టపడి పని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, సీఎం చంద్రబాబుపై ఆయన అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు.

2లో

## మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిసిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే




ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 11 (రిపబ్లిక్ న్యూస్) రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియమర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ తో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ విజయవాడ 47వ డివిజన్లోని బాధితుల నష్టాల గురించి చర్చించారు.విజయవాడలోని 47 వ డివిజన్ లో వరద ప్రభావం తర్వాత వరద బాధితుల కష్టాలు తీర్చేందుకు అక్కడ పర్యటించి ప్రజలకు రేషన్ పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు.వరద వల్ల కొంతమంది తమ దుకాణాలు మరియు సామగ్రిని కోల్పోయారని , భారీ వరద నీటి కారణంగా కుటుంబాలు తమ ఇంటి అవసరాలు గృహోపకరణాలు కోల్పోయారని తెలిపారు. నష్టపోయిన 66 మంది బాధితుల జాబితాను మంత్రి లోకేష్ కు ఎమ్మెల్యే అందజేసి వారికి ప్రభుత్వ పక్షం నుండి అవసరమైన సహాయం వెంటనే అందచేయవలసిందిగా ఆమె కోరారుమంత్రి లోకేష్ వరద బాధిత ప్రజల కోసం కష్టపడి వారికి అండగా ఉండి సేవలందించినందుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు అభినందనలు తెలిపారు.

2లో

## సీఎం రేవంత్ రెడ్డితో పవన్ కళ్యాణ్ భేటీ



లసీఎం రేవంత్ రెడ్డితో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ నివాసంలో రేవంత్ తో సమావేశం అయ్యారు. ఇటీవల ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళాన్ని పవన్ కళ్యాణ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్‌ను అందజేశారు పవన్. కాగా ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి డిప్యూటీ సీఎం హెూదాలో సీఎం రేవంత్ ను పవన్ కళ్యాణ్ సమావేశం అయ్యారు. కాగా ఇటీవల సీఎం చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యి రూ .కోటి చెక్ ను అందజేసిన విషయం తెలిసిందే.

**తెలుగు రాష్ట్రాలకు భారీ విరాళం..** ఇటీవల ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వరద బాధితుల కోసం భారీ విరాళాన్ని ప్రకటించారు. 400 గ్రామ పంచాయతీలు వరద ముంపు బారిన పడ్డాయి.. ఒక్కో పంచాయతీకి రూ. లక్ష చొప్పున నేరుగా పంచాయతీ ఖాతాకు విరాళం పంపిస్తాను అని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. రూ.4 కోట్లు మొత్తం ముంపు గ్రామ పంచాయతీలకు పంపించాలని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. కోటి విరాళం అందించనున్నానని అధికారికంగా ప్రకటించారు.

**రేవంత్ నిర్ణయానికి పవన్ సై** ఇటీవల తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి మొదలు పెట్టిన హైడ్రా పై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ లో జరుగుతున్న హైడ్రా అనేది కరెక్ట్, కాకపోతే అసలు అక్కడ నిర్మాణాలు జరుగుతున్నప్పుడు గత ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? అని ప్రశ్నించారు. పూర్తిగా కట్టేసిన తరవాత కూల్చడం వలన సామాజిక సమస్యలు ఉత్పన్నమ వుతు న్నాయని అన్నారు.

ఇక్కడ ఎలా పరీవాహక ప్రాంతాలు పరిరక్షించుకోవాలి అనేదానిపై చర్యలు తీసుకుంటాం అని అన్నారు. తెలంగాణలో లాగా హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకువస్తే మంచిదే.. కానీ అలా చేస్తే ఇక్కడ చాలా మంది ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు. దీనిపై ఏం చేయాలి అనే దానిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

**కూర్మన్నపాలెం జంక్షన్‌లో రాస్తారోకో**
**స్టీలుప్లాంటును పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపాలి**
**నిర్వహణ మూలధనం సమకూర్చాలి**
**సెయిల్‌లో విలీనం చేయాలి**
**ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు కేంద్రం తక్షణం ప్రకటన చేయాలని డిమాండ్**
**జాతీయ రహదారిపై కిలో మీటర్లు మేర నిలిచి పోయిన వాహనాల రాకపోకలు**
**కార్మిక సంఘాల నేతలు అరెస్టు...స్టీల్‌ప్లాంటు పోలీస్ స్టేషన్‌కు తరలింపు**




కూర్మన్నపాలెం, సెప్టెంబరు 10: ఉక్కు కార్మికులు పిడికిలి బిగించారు. కర్మాగారాన్ని పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపాలని, సొంత గనులు కేటాయించడంతో పాటు నిర్వహణ మూలధనం సమకూర్చాలని, సెయిల్‌లో విలీనం చేస్తూ, ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కూర్మన్నపాలెం జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకూ జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో వందలాది మంది కార్మికులు, ఉద్యోగులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ప్లకార్డులు, బ్యానర్లు చేత పట్టుకొని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రహదారిపై బైఠాయించారు. దీంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రంగప్రవేశం చేసినా కార్మికులు వెనక్కి తగ్గలేదు. దీంతో కార్మిక సంఘ నాయకులను ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి స్టీల్‌ప్లాంటు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకొంది. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉద్యమాలను అణచివేయడం తగదన్నారు. ఉక్కు కార్మికులను నిర్బంధించాలని చూస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి వచ్చేలా చేస్తామన్నారు. పోలీసులు మద్దతు ఇస్తామని చెప్పి కార్మికులకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే చర్యలను నిలుపు చేయాలని కోరారు. జె.అయోధ్యరామ్, పరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించకుండా ప్రభుత్వం చోద్యం చూడడం అన్యాయమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే, తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులను కేటాయించాలన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవలసిన బాధ్యత రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, నిర్వాసిత నాయకులు ఎన్.గంగారామ్, పులి వెంకటరమణారెడ్డి, కేఎస్ఎన్ రావు, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, జెర్రిపోతుల ముత్యాలు, బొడ్డు పైడిరాజు, విళ్ల రామ్మోహన్‌కుమార్, దొమ్మేటి అప్పారావు, పెంటారావు, శ్రీనివాసులు నాయుడు, ప్రగడ వేణుబాబు, పీవీ రమణ, యు.రామస్వామి, వి.ప్రసాద్, వెంకటేశ్వరరావు, గంగవరం గోపి, మాటూరి రాము, గణపతిరెడ్డి, రమణ, మాటూరి శ్రీనువాస్, గుమ్మడి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖపై ఫిర్యాదుల వెల్లువ

విశాఖపట్నం, సెప్టెంబరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖతో పాటు పలు ఆస్పత్రుల్లో జరుగుతున్న వ్యవహారాలపై ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో సూపరింటెండెంట్ నిధులను దుర్వినియోగం చేయడంతోపాటు సిబ్బందిని వేధిస్తున్నారంటూ భాస్కర్ శతపతి అనే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు కొద్దిరోజుల కిందట ఫిర్యాదు చేశారు.




**ఏఎన్ఎం, ఇతర పోస్టుల భర్తీలో అవకతవకలు**
**విజిలెన్స్ అధికారులకు ఒక ఉద్యోగి ఫిర్యాదు**
**ఆంధ్ర మెడికల్ కాలేజీ పరిధిలోనూ అక్రమాలు**
**విచారణకు ఆదేశించిన డైరక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్..?**
**ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై సీఎంకు అందిన ఫిర్యాదు**
**విజయవాడ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు విచారణ బాధ్యత?**

5 లో

## ప్రతి ఎకరానికి 10వేలు ఇస్తాం రైతులు అధైర్య పడొవద్దు సీఎం

.ఆ తర్వాత ఆయన సీఆర్‌రెడ్డి కాలేజ్ ఆడిటోరియంలో వరదలకు నష్టపోయిన రైతులు, వరద బాధితులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీలోపు నష్ట పరిహారంపై నిర్ణయం తీసుకుంటామని, వరికి మాత్రం ఎకరానికి రూ. 10 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మాణంపై సీరియస్‌గా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.పోలవరం ప్రాజెక్టు తెలుగుదేశం హయాంలో 72 శాతం పూర్తిచేసామని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ పోలవరాన్ని ముంచేసారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఇప్పుడు పోలవరం పూర్తిచేయాలనే ఉద్దేశ్యంతో కేంద్రంతో మాట్లాడి రూ. 12 వేల కోట్లు తీసుకువచ్చామన్నారు. త్వరలోనే పోలవరం పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. వరదలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముందుగా తీసుకుంటామని, వరదల వలన సాగునీటి సంఘాల ఎన్నికలు ఆలస్యం అయ్యాయని, త్వరలోనే అవి వస్తాయని తెలిపారు. శనివారపుపేట కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నానని, పెదపాడు మండలంలో లోయేరు వాగు మరమత్తులు చేపడతామని చెప్పారు. వరదల వలన నష్టపోయిన అందరినీ ఆదుకుంటామని స్పష్టం చేశారు. తాను, తన మిత్రుడు పవన్ కళ్యాణ్, బీజేపీలు (కూటమి ప్రభుత్వం) సుపరిపాలన అందిస్తామని, కౌలు రైతుల ఖాతాల్లోకి నేరు ఇన్ పుట్ సబ్సీడీ వేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**బెజవాడను ముంచింది జగన్ అండ్ కో నే**

గతంలో బుడమేరుకు గండ్లు పడితే వైసీపీ ప్రభుత్వం పూడ్చలేదని విమర్శించారు. బుడమేరు వాగు పరిధిలో గత ప్రభుత్వం అక్రమార్కులను ప్రోత్సహించిందని, అక్రమ కట్టడాలకు తప్పుడు దారిలో అనుమతులిచ్చిందని వివరించారు. కుండపోత వర్షాలు, వరదలకు వాతావరణ మార్పులు కారణమని చెప్పారు. అయితే, ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వరదల ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు.

**ఆ బోట్లు వాళ్లవే..**

ఎన్నికల్లో ఓడించిన ప్రజలపై కక్ష తీర్చుకునే వైపుగా వైసీపీ నాయకులు పోతున్నారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. కృష్ణా నదిలో వదిలిపెట్టిన నాలుగు బోట్లు వైసీపీ వాళ్లవేనని చెప్పారు. ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేయడానికి ఆ పార్టీ వాళ్లు ఉద్దేశపూర్వకంగానే వాటిని నదిలో వదిలిపెట్టారని వివరించారు. ఆ బోట్లపై వైసీపీ రంగు ఉందన్న విషయం గుర్తుచేశారు. ఒకదానిని మరొకటి చైన్లతో కట్టి నదిలో వదిలి పెట్టడంతో అవి బ్యారేజీ గోడలను ఢీ కొట్టాయని, ఇప్పటికీ వాటిని బయటకు తీయడానికి అధికారులు శ్రమిస్తూనే ఉన్నారని చంద్రబాబు తెలిపారు.

ఆ బోట్లను ఇసుక అక్రమ రవాణాకు ఉపయోగించే వారని ఆరోపించారు. వైసీపీ లీడర్ జగన్ ఇప్పుడు మాట్లాడుతూ.. ఆ బోట్లు టీడీపీ వాళ్లవేనని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. ప్రకాశం బ్యారేజీని కూల్చాలని కుట్ర చేశారని, దీని వెనక రాజకీయ లింకులు లేకుంటే ఒక్క నిమిషంలో నిందితులను ఏం చేయాలో అది చేసే వాడినని వివరించారు. రౌడీలు, గూండాలను తాను ఎన్నడూ సహించలేదని, సామాన్యులకు ఇబ్బంది కలిగించే వారిపట్ల తానెప్పుడూ కఠిన వైఖరినే అవలంబించానని చంద్రబాబు గుర్తుచేశారు.

## మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిసిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

అలాగే ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని తాజా పరిస్థితులను మంత్రికి వివరించారు ఆళ్లగడ్డలోని డిగ్రీ కాలేజీలో సరైన మౌలిక వసతులు లేవని అభివృద్ధికి సహకరించాలని కోరారు పలు సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

అలాగే ఆళ్లగడ్డ లోని డిగ్రీ కళాశాల ఇటీవలే తనిఖీలు చేశానని కళాశాలలో ఎటువంటి మౌలిక వసతి సదుపాయాలు లేవని కళాశాల ప్రిన్సిపల్ ఇవేవీ పట్టించుకోవడంలేదని నార లోకేష్ గారికి ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ గారు వివరించారు...

ఐటి మినిష్టర్ నారా లోకేష్ అన్నగారు వెంటనే సానుకూలంగా స్పందించి ఆళ్లగడ్డకు డిగ్రీ కళాశాల భవనాన్ని మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది....

## ఆ 11సీట్లు కూడా ఎందుకు ఇచ్చామని ప్రజలు బాధపడుతున్నారు..

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఆయన తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అసత్యాలతో జీవిస్తున్నారని ప్రతిరోజూ నిరూపించుకుంటూనే ఉన్నారని విమర్శించారు.

ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. "భారతదేశంలో సీఎంగా పని చేసిన వ్యక్తి ఎవ్వరూ ఇప్పటివరకూ ఇంత నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పలేదు. బురద రాజకీయాలు చేయలేదు. బుడమేరు ఎక్కడ ఉంది.. డైవర్షన్ కెనాల్, రెగ్యులేటర్ ఎక్కడ ఉన్నాయి.. గండ్లు ఎప్పుడు, ఎక్కడ పడ్డాయి, కృష్ణానదీ ప్రవాహాలు ఎలా వచ్చాయనే అంశాలపై కనీస అవగాహన లేకుండా జగన్ మాట్లాడుతున్నారు. మొన్నంటే తెలియక ఏదోదే అన్నారనుకుంటే.. ఇప్పుడు మళ్లీ అదే రాగం తీస్తున్నారు. జగన్ ఒక అబద్ధాన్ని పట్టుకుని ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

వరదల అంశాన్ని మళ్లించేందుకే వైసీపీ నేతలను అరెస్టు చేస్తున్నారని జగన్ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నా. తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడిని సమర్థించుకున్న నీచమైన వ్యక్తి ఒక మాజీ సీఎం అని చెప్పడానికి బాధేస్తోంది. జనం కష్టాల్లో ఉంటే జైలుకు వెళ్లి క్రిమినల్‌ను పరామర్శించే జగన్‌కు మమ్మల్ని ప్రశ్నించే హక్కులేదు. పంటలు మునిగి ప్రజలు కష్టాల్లో ఉంటే పంటలు దగ్ధం చేసిన చరిత్ర కలిగిన వ్యక్తి వద్దకు వెళ్లి పరామర్శించడం జగన్‌కు మాత్రమే చెల్లింది. 6లక్షల మంది వరదల్లో చిక్కుకోవడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన పాపాలే కారణం. ఇలాంటి దారుణ పరిస్థితులు కల్పించిన జగన్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని అన్నారు.

## ఆరోగ్య శాఖపై ఫిర్యాదుల వెల్లువ

అర్హత లేని వ్యక్తిని డ్రైవర్‌గా నియమించుకున్నారని, గతంలో సీఎం జగన్ తనకు బంధువు అని చెప్పి ఉద్యోగులను భయాభ్రాంతులకు గురిచేయడంతోపాటు అడ్డగోలుగా నిధులను డ్రా చేశారంటూ సూపరింటెండెంట్‌పై సదరు వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు విచారణ బాధ్యతలు అప్పగించినట్టు చెబుతున్నారు. అలాగే, 2019–2020 మధ్య జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సచివాలయ ఏఎన్‌ఎం పోస్టులను భర్తీచేశారు. ఈ పోస్టుల భర్తీలో అవినీతి జరిగిందంటూ ఆరోగ్య శాఖలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగి ఒకరు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పలువురికి ఉద్యోగాలు ఇచ్చారంటూ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే క్లాస్–4, జూనియర్ అసిస్టెంట్, ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వో పోస్టులకు సంబంధించి చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో భారీగా డబ్బులు చేతులు మారాయని, అస్మదీయులకు మేలు చేశారంటూ ఆరోగ్య శాఖలో ఏవోగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఒకరు అప్పట్లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన అధికారిపై ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు తాజాగా ఆయా నియామకాలకు సంబంధించిన వివరాలు ఇవ్వాలంటూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి లేఖ రాశారు. అలాగే, ఆంధ్ర మెడికల్ కాలేజీ పరిధిలో కొన్నాళ్ల కిందట పలు పోస్టులను భర్తీచేశారు. ఆ పోస్టుల భర్తీలో అక్రమాలు జరిగాయని, తనకు రావాల్సిన ఉద్యోగాన్ని ఫేక్ సర్టిఫికెట్లు పెట్టిన వారికి ఇచ్చారంటూ ఒక యువతి జిల్లా కలెక్టర్, డీఎంఈ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై విచారణ చేసిన అధికారులు అడ్డగోలుగా ఉద్యోగాలు పొందిన ఇద్దరిని కొద్దిరోజుల కిందట విధుల నుంచి తొలగించారు. అయితే, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణకు డీఎంఈ ఆదేశించినట్టు తెలిసింది.




## భారీ వర్షాలతో రోడ్లు ఛిద్రం

### అచ్యుతాపురం సెజ్ రహదారుల్లో అడుగడుగునా గోతులు
### రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

**అచ్యుతాపురం,** గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలో పలు రహదారులు ఛిద్రమయాయి. ముఖ్యంగా సెజ్ కర్మాగారాలకు వెళ్లే రహదారిలో భారీ గోతులు ఏర్పడి అధ్వానంగా తయారైంది. అచ్యుతాపురం–పూడిమడక రహదారిలో మైలురాయి వంతెన వద్ద రెండు అడుగుల లోతున గొయ్యిలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. దుప్పితూరు వద్ద సుమారు 500 మీటర్ల మేర అడుగో గొయ్యి వుంది. ద్విచక్ర వాహనదారులు కూడా గోతులను తప్పించుకునే వీలులేకుండా వుంది. ఇంకా బ్రాండిక్స్ ముఖద్వారం, ఏషియన్ పెయింట్స్, ఐమెరీస్ కర్మాగారాం, లాలం కోడూరు జంక్షన్ వద్ద కూడా రోడ్డు కొట్టుకుపోయింది. అచ్యుతాపురం– మార్టూరు రోడ్డులో మార్టూరు నూకాలమ్మ ఆలయం, సెజ్ పునరావాస కాలనీ ముఖద్వారం వద్ద భారీ గుంతలు పడ్డాయి. అధికారులు



స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ముంపులోనే పంట పొలాలు

### వర్షం తగ్గినప్పటికీ వీడని వరద
### లోతట్టు భూముల్లో వరిపైరు నీట మునిగి.. కుళ్లిపోతున్నదని అన్నదాతలు ఆవేదన
### పంట నష్టం అంచనాల్లో వ్యవసాయ శాఖ

**చోడవరం, సెప్టెంబరు**

మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు 600 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. సోమవారం రాత్రి నుంచి వర్షం పూర్తిగా ఆగిపోయి సాధారణ వాతావరణం నెలకొన్నప్పటికీ, పంట భూముల్లో వరద నీరు ఇంకా తగ్గలేదు. దీంతో పంటలు కుళ్లిపోతాయని రైతులు వాపోతున్నారు. పెద్దేరు, శారదా, బొడ్డేరు నదుల్లో ఆది, సోమవారాలు వరద ఉధృతంగా ప్రవహించడంతోపాటు భారీ వర్షాలు కురవడంతో మండలంలోని కన్నంపాలెం, రామజోగిపాలెం, తిమ్మనపాలెం, బెన్నవోలు, ముద్దుర్తి, గంధవరం, లక్ష్మీపురం, అంకుపాలెం, నరసయ్యపేట, వెంకన్నపాలెం, భోగాపురం, చాకిపల్లి, ఖండేపల్లి, గవరవరం, లక్కవరం, దుడ్డుపాలెం, పీఎస్‌పేట, అన్నవరం గ్రామాల్లోని వరి, చెరకు పంటలు నీటమునిగాయి. ముఖ్యంగా కన్నంపాలెం, రామజోగిపాలెం గ్రామాల్లో పంట



పొలాలు పూర్తిగా నీటమునిగి జలాశయాన్ని తలపిస్తున్నాయి. మంగళవారానికి కూడా శారదా, పెద్దేరు నదుల్లో వరద ఉధృతి తగ్గకపోవడంతో పంటపొలాల్లో నుంచి వరదనీరు బయటకు పోవడం లేదు. మండలంలో 235 హెక్టార్లలో పంటలు నీటమునిగి నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనావేశారు.

రావికమతం మండలంలోని దొండపూడి, పి.పోన్నవోలు, మేడివాడ, గర్నికం, దిడ్డి, బాధనపాడు, పెదపాచిల తదితర గ్రామాల్లో 22.6 హెక్టారుల్లో వరి పంట ముంపునకు గురైంది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రాథమికంగా అంచనా వేశారు.

**రెండు ఎకరాల్లో వరిపైరు మునిగిపోయింది**

పల్లా అప్పారావు, కన్నంపాలెం, చోడవరం మండలం

రెండు ఎకరాల్లో వరి సాగుచేపట్టాను. సుమారు నెల రోజుల క్రితం నాట్లు పూర్తయ్యాయి. ఇంతవరకు వివిధ రకాల పనులు, ఎరువుల కోసం సుమారు రూ.25 వేల వరకు ఖర్చయ్యాయి. గత వారం రోజుల నుంచి రెండు పర్యాయాలు కురిసిన భారీ వర్షాలకు వరి పంట మొత్తం నీట మునిగింది. నదుల్లో వరద తగ్గకపోవడంతో పొలాల్లో నుంచి నీరు బయటకు వెళ్లడంలేదు. గత ఏడాది వర్షాలు సరిగా లేక పంట చేతికి రాలేదు. ఈ ఏడాది అధిక వర్షాలతో మళ్లీ అదే పరిస్థితి ఏర్పడింది.

**మేజర్, మైనర్ శారదా నదుల్లో తగ్గని వరద ముంపు నుంచి తేరుకోని వరి పొలాలు**

**రాంబిల్లి,** : వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతాల్లో నుంచి రాంబిల్లి మండలం మీదుగా పయనించే మేజర్, మైనర్ శారదా నదులు గత మూడు రోజుల నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రమాదకరస్థాయిలో వరద ప్రవాహిస్తుండడంతో బలహీనంగా ఉన్న నదుల గట్లకు గండ్లు పడే ప్రమాదం వుందని పలు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం వర్షం కురవనప్పటికీ మైనర్, మేజర్ శారదా నదుల్లో వరద ఉధృతి తగ్గలేదు. కొప్పుగొండుపాలెం, పెదకలవలాపల్లి, వెల్చూరు, రాజుకోడూరు, పంచదార్ల, మర్రిపాలెం, కట్టుబోలు, కుమ్మరాపల్లి, రజాలఅగ్రహారం తదితర గ్రామాల పరిధిలో వరి పొలాలు మూడు రోజుల నుంచి ముంపులోనే ఉన్నాయి. మండలంలో 124 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైనట్టు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 'ఫినిష్ ఆంధ్రా'!




**చోడవరం, సెప్టెంబరు 11**

నిరుద్యోగ యువతకు వ్యాపారాల ద్వారా ఉపాధి కల్పన అంటూ గత వైసీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన 'ఫిష్ ఆంధ్రా' యూనిట్లు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. జిల్లాలో ఒక్కడా ఒక్క అవుట్‌లెట్ కూడా వినియోగంలో లేదు.

'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మత్స్య శాఖ అధికారులు పలు గ్రామాల్లో చేపలు, రొయ్యలు, పీతలు వంటి వాటి విక్రయానికి ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులతో ఫిష్ ఆంధ్ర యూనిట్లు ఏర్పాటు చేయించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.2.5 లక్షలు కాగా.. ఇందులో ఎస్‌సీ, ఎస్‌టీలకు 60 శాతం, బీసీలకు 40 శాతం, మైనారిటీలకు 50 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పది శాతం సొమ్మును లబ్ధిదారులు పెట్టుబడిగా పెట్టుకుంటే మిగిలిన సొమ్మును బ్యాంకుల నుంచి రుణంగా మంజూరు చేయిస్తామని అధికారులు చెప్పడంతో 'ఫిష్ ఆంధ్రా' యూనిట్లు పెట్టడానికి చాలా మంది ముందుకు వచ్చారు. వీరిలో అర్హులను ఎంపిక చేసిన మత్స్యశాఖ అధికారులు.. ముందస్తు పెట్టుబడిగా లబ్ధిదారుల నుంచి వారి వాటా నిధులు (ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల వరకు) వసూలు చేశారు. ఫ్రిజ్‌లు, ఐస్ బాక్సులు, కట్టర్స్, తూకం యంత్రాలు, ఇతర సామగ్రిని సరఫరా చేశారు. అన్ని కేంద్రాలకు తాజా చేపలు రొయ్యలు పీతలు సరఫరా చేస్తామని చెప్పారు. పలుచోట్ల అప్పటి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఆర్భాటంగా 'ఫిష్ ఆంధ్రా' కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఆ తరువాత చేపలు, రొయ్యలు, పీతలు అందుబాటులో లేవంటూ ప్రభుత్వం చేతులెత్తేసింది. ప్రభుత్వం నుంచి సబ్సిడీ సొమ్ము వచ్చేవరకు 'ఫిష్ ఆంధ్రా' యూనిట్లను నడిపిన లబ్ధిదారులు.. తరువాత వాటిని మూసివేశారు. కాగా యూనిట్లు ఏర్పాటు చేసిన వారిలో కొందరికి మాత్రమే సబ్సిడీ వచ్చిందని, మిగిలిన వారికి సబ్సిడీ సొమ్ములు అందలేదని తెలిసింది. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో 19 'ఫిష్ ఆంధ్రా' అవుట్‌లెట్లు ప్రారంభించగా, ప్రస్తుతం ఒక్కటి కూడా వినియోగంలో లేదు.

## రోడ్డు ప్రమాదంలో రిటైర్డు ప్రిన్సిపాల్ మృతి



**ఎచ్చెర్ల:** కేశవరావుపేట జంక్షన్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో రిటైర్డు ప్రిన్సిపాల్ పూజారి శ్రీరాములు(76) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇదే మండలం కేశవరావుపేట గ్రామానికి చెందిన ఈయన శ్రీకాకుళం నగరంలో నివాసం ఉంటున్నారు. స్వ గ్రామంలోని సచివాలయంలో పని మీద శ్రీకాకుళం నుంచి ఆటోపై వచ్చిన ఆయన కేశవరావుపేట జంక్షన్‌లో దిగి రోడ్డు దాటుతుండగా పాతపట్నం నుంచి విశాఖ వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. శ్రీరాములుకు భార్య పూర్ణమ్మ, కుమారుడు శ్రీనివాసరావు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'భూదాన్' భూములను పరిరక్షించండి

**షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 11**: భూస్వాముల నుంచి సేకరించి, పేదల జీవనోపాధి కోసం పంపిణీ చేసిన భూధానోద్యమ భూములను పరిరక్షించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పద్మశాలి భవనంలో బుధవారం వినోభాబావే 129వ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. బక్కని మాట్లాడుతూ మహారాష్ట్రలో పుట్టి దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన వినోభాబావే ఆశయాన్ని రియల్టర్లు, స్వార్థ రాజకీయ నాయకులు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినోభాబావే దేశ వ్యాప్తంగా పాదయాత్ర చేసి దాదాపు 46 లక్షల ఎకరాల భూమిని సేకరించి, పేదలకు పంచారని తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో కూడా పలువురు భూములను ఇచ్చారని తెలిపారు. నాడు రాష్ట్ర వ్యాప్తంగా కోటీ 70 లక్షల జనాభా ఉన్నప్పుడు భూమి కోసం సాయుధ పోరాటాలు జరిగాయని, నేడు 4 కోట్ల జనాభా ఉన్నా కూడా భూమి కొనుగోలుపై పరిమితిని విధించకపోతే ఎలా అని ప్రశ్నించారు. పట్టణ ప్రముఖులు పరిగి వెంకటసాయిశ్వర్‌రెడ్డి, సాయికృష్ణ, లింగారం కుమార్‌గౌడ్, వి. గంగిరెడ్డి, ఒగ్గు కిషోర్, పద్మశాలి సంఘం నాయకులు జనార్ధన్, చెన్న బాల్‌రాజ్, సత్యనారాయణ, బసా రాజేందర్, బాలాజీ, దాస రమేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

## 89 చోరీ కేసుల్లో 80 మంది అరెస్టు


### నిందితుల నుంచి రూ.22.37 లక్షల విలువైన సొత్తు రికవరీ



**విశాఖపట్నం, సెప్టెంబరు** నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆగస్టు నెలలో జరిగిన 89 చోరీ కేసులకు సంబంధించి 80 మంది నిందితులను అరెస్టు చేసినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును బాధితులకు తిరిగి అందజేసేందుకు 'రికవరీ మేళా' పేరుతో పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల నగరంలో 112 చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. వీటిలో 89 కేసులను నేర పరిశోధన విభాగం అధికారులు, సిబ్బంది ఛేదించారన్నారు. ఆయా నేరాలకు పాల్పడిన 80 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.22.37 లక్షల విలువైన బంగారం, నగదు, ద్విచక్ర వాహనాలు, ఆటోలతోపాటు 255 సెల్‌ఫోన్‌లు రికవరీ చేశారన్నారు. ప్రతి నెలా కేసుల ఛేదనతోపాటు రికవరీ పెంచాలన్న లక్ష్యానికి అనుగుణంగా క్రైమ్ డీసీపీ లతామాధురి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని అభినందించారు. వారందరికీ త్వరలో రివార్డులు అందజేయనున్నట్టు ప్రకటించారు. అనంతరం రికవరీ చేసిన సొత్తును బాధితులకు సీపీ చేతులు మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, క్రైమ్ డీసీపీ కె.లతా మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జీవో 115 రద్దు చేయాల్సిందే..

### జిల్లా కేంద్రాసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న స్టాఫ్‌నర్సులు
### జిల్లాకేంద్రాసుపత్రి వద్ద నిరసన




**పార్వతీపురం, సెప్టెంబరు /బెలగాం :** తమకు నష్టం కలిగించే జీవో 115ను తక్షణమే రద్దు చేయాలని స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. బుధవారం పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రిలో నిరసన తెలిపారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న 27 మందిని క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని నినదించారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయకుండా సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పించాలని ప్రయత్నించడం తగదన్నారు. మూడున్నరేళ్ల జీఎన్‌ఎం, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి ప్రభుత్వాసుపత్రుల్లో కొన్నేళ్లుగా సేవలందిస్తున్న తమను న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం వారు జిల్లా కేంద్రాసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి సమస్యను తెలియజేశారు. తమను ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. స్టాఫ్ నర్సుల సంఘం ప్రతినిధులు నారాయణరావు, స్వాతి, సాయికుమారి, పద్మజ, కన్నమ్మ తదితరులున్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని నంద్యాల అసెంబ్లీ ముస్లిం జెఏసి కార్యవర్గం వినతి పత్రం.



**నంద్యాల సెప్టెంబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):** విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిఇఓ సుధాకర్ రెడ్డికి అసెంబ్లీ ముస్లిం జేఏసీ వినతిపత్రం సమర్పించారు. బుధవారంఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ గన్ని అబ్దుల్ కరీం మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా విద్యా హక్కు చట్టం అమలు జరగడం లేదని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 24ను యధావిధిగా కొనసాగించాలని వినతి పత్రం అందించడం జరిగిందన్నారు.

జేఏసీ కార్యవర్గ సభ్యులు షేక్.రియాజ్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం అమలు చేయకుండా కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విద్యా శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని.

నంద్యాల జిల్లాలో ఎక్కడ ఫీజు నియంత్రణ చట్టం 25 శాతం ఉచిత సీట్లు చట్టం అమలు కావడం లేదు గత విద్యా సంవత్సరంలో విద్యా హక్కు చట్టం కింద చదువుతున్న విద్యార్థులకు వేల రూపాయలు ఫీజులు కట్టాలని పాఠశాలల యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నారని దీనిపై వెంటనే చర్యలు తీసుకుని తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లా విద్యా అధికారి సానుకూలంగా స్పందిస్తూ ఏ పాఠశాల యాజమాన్యం అయిన విద్యా హక్కు చట్టం కింద చదువుతున్న విద్యార్థులకు ఫీజులు కట్టాలని వేధింపులకు గురి చేస్తే తల్లిదండ్రులు నేరుగా విద్యా శాఖకు ఫిర్యాదు చేయగలరని తెలిపారు.

## వేల్పనూరు లో ఘనంగా పౌష్టికాహార మహోత్సవాలు.




**వెలుగోడు సెప్టెంబర్ 11 రిపబ్లిక్ న్యూస్** మండల పరిధిలోని వేల్పనూరు గ్రామ జిల్లా పరిషత్ ఉంది పాఠశాలలో బుధవారం నాడు పౌష్టికాహార మహోత్సవాలు ఐసిడిఎస్ సూపర్వైజర్ కోమలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు బాల్యవివాహాలు, ఆరోగ్యం ,పరిశుభ్రత, శానిటేషన్, రక్తహీనత గురించి వివరించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏఎన్ఎం సుజాత అంగన్వాడి టీచర్లు నాగలక్ష్మి, కుమారి, గౌరీ, శోభ రాణి, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## గర్భవతులు బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ



**గిద్దలూరు, సెప్టెంబర్11, ప్రజా రిపబ్లిక్. ::** అంగన్ వాడి కేంద్రాల ద్వారా గర్భవతులు బాలింతలకు అందించే పౌష్టికాహారం కిట్లను బుధవారం గిద్దలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ షేక్ షరీఫ్ పంపిణీ చేశారు. స్థానిక నంద్యాల రోడ్డులోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గర్భవతులు బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తల పై సలహాలు సూచనలు అందజేశారు. ప్రతిఒక్కరు అంగన్వాడి కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెల ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కాన్పు సులభతరం అవుతుందన్నారు. ప్రతిఒక్కరు ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు. బాలింతలు చిన్నారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుధారాణి, ఏ ఎన్ ఎం, ఆశా కార్యకర్తలు,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 15 లోపు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలి

**గిద్దలూరు, సెప్టెంబర్ 11 , రిపబ్లిక్ న్యూస్. ::**

రైతులు సాగు చేసిన పంటలను ఈక్రా బుకింగ్ ఈనెల 15వ తేదీలోపు చేయించుకోవాలని గిద్దలూరు మండల వ్యవసాయ శాఖ అధికారి వై వి భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం గిద్దలూరు మండలంలోని ఓబులాపురం, సంజీవరావుపేట, కొమ్మునూరు గ్రామాల్లో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఖరీఫ్ 2024 -25 సాధారణ విస్తీర్ణము 18,935 ఎకరాలకు గాను ఇప్పటివరకు 9,000 ఎకరాలు సాగు చేయగా అందులో 8,200 ఎకరాల మేర ఈ- పంట నమోదు చేయడం పూర్తి అయినదని తెలిపారు. ఈనెల 15వ తేదీ లోపు ఈ పంట నమోదు చేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు, కావున గ్రామాల్లోని ఇంతవరకు ఈ- పంట నమోదు చేయించుకోని రైతులు గ్రామ వ్యవసాయ,ఉద్యాన, పట్టు పరిశ్రమ

సహాయకులను సంప్రదించి ఈ- పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పంట నమోదు చేసుకోవడం వలన ప్రభుత్వం నుండి వచ్చేటువంటి పంట నష్టపరిహారము, పంటల భీమా, మద్దతు ధర, పంట రుణాలు మొదలైనవి వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్ రెడ్డి,రవి, యూనస్ రైతులు పాల్గొన్నారు.

# ఏడు నెలలుగా ఆగిపోయిన జీతం విడుదల

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి రాగానే సమస్య తక్షణ పరిష్కారం
### రూ.30 కోట్లు వేతన బకాయిలు విడుదల
### శ్రీ సత్యసాయి వాటర్ సప్లై స్కీంలో 536 మంది కార్మికుల సమస్యకు పరిష్కారం

**అనంతపురం సెప్టెంబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టు బోర్డు ద్వారా గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు అందించే పథకం సాగుతోంది. ఇందులో పని చేసే 536 మంది కార్మికులకు 7 నెలలుగా జీతాలు అందటం లేదు. 536 మంది కార్మికుల సమస్య రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి రాగానే పరిష్కారం లభించింది. రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇందులో పని చేస్తున్న 536 మంది కార్మికుల ఏడు నెలల జీతాలు బకాయిలు చెల్లింపుపై పవన్ కళ్యాణ్ ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడారు. బకాయిలకి సంబంధించి రూ.30 కోట్లు బడ్జెట్ రిలీజ్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆర్థిక శాఖ కార్యదర్శి బి.ఆర్.ఓ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి జీవో విడుదల చేశారు.ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి 1341 గ్రామాల్లో, సుమారు 20 లక్షల జనాభాకు ఈ స్కీం ద్వారా తాగు నీరు అందుతోంది. ఈ స్కీం నిర్వహణకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేసే 536 మంది కార్మికులకు ఈ సంవత్సరం ఫిబ్రవరి నెల నుంచి వేతనాలు నిలిచిపోయాయి. రూ.30 కోట్ల మేర పెండింగ్ వేతనాలు ఆగిపోయాయి. కార్మికులు విధులకి దూరంగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ దృష్టికి రాగానే గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ అధికారులను ఆరా తీశారు. ఆర్థికశాఖ అధికారులతో మాట్లాడారు. రూ.30 కోట్లను వేతనాల కోసం విడుదల చేసేందుకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది.కార్మికుల వేతన బకాయిల సమస్యపై సత్వరమే స్పందించిన ఆర్థిక, పంచాయతీరాజ్, ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విభాగాలు సానుకూల దృక్పథంతో పని చేసేలా దిశానిర్దేశం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

# రైతులు వేసిన పంటకు ఈ కేవైసీ తప్పనిసరి

### మండల వ్యవసాయశాఖ అధికారి షేక్ అబ్దుల్ రఫీక్

**రాచర్ల సెప్టెంబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)::-** రైతులు వేసిన పంటలకు తప్పనిసరిగా ఈ కేవైసీ తప్పనిసరిగా చెప్పించాలని మండల వ్యవసాయశాఖ అధికారి షేక్ అబ్దుల్ రఫీక్ అన్నారు. మండలంలోని చోళ్ళవీడు , చిన్నగానిపల్లి,ఆకవీడు,ఆరవీటికోట మరియు జేపీ చెరువు గ్రామాలలో ఖరీఫ్ సీజన్ లో సాగు చేసినటువంటి పత్తి మరియు ఆముద పంటలను పరిశీలించారు.ఆముద పంటలో విత్తిన 45 నుంచి 50 రోజులకు ఆముదం మొక్క తలను ఒక మొగ్గను ఉంచి మిగిలిన కొమ్మలను విడతలు వారీగా తుంచడం వలన అనవసర కొమ్మల పెరుగుదలను ఆగి, కనుపుల మధ్య దూరం తగ్గి మొక్క ఎత్తు తగ్గుతుందని దాని వలన గెల పొదవు,గింజ లావుగా ఉండి తూకము ఎక్కువగా అవ్వడానికి అవకాశం ఉందని అలాగే పంట కాలం కూడా దాదాపు 40 రోజుల వరకు తగ్గుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఆముదం పంటలో దాసరి పురుగును ఉందని దీని నివారణ నోవల్యూరాన్ 1 %ఎశ్రీ% లేదా ఫ్లూబెండమైడ్ 0.2 %వీశ్రీ% లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు.అలాగే పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులను గురించి రైతులకు వివరించారు.అనంతరం పంట నమోదు మరియు రైతు యొక్క అతంటికేషన్ గురించి గ్రామం లోని రైతులతో మాట్లాడారు.పంట నమోదు, మరియు రైతు యొక్క అతంటికేషన్ చివరి దశలో ఉంది కాబట్టి మండల వ్యవసాయ అధికారి కార్యాలయం సిబ్బంది మధ్యాహ్నం వరకు గ్రామాలలో ఉండి పంట నమోదు మరియు ఈకేవైసీ పర్యవేక్షించడం జరుగుతుందనీ.కాబట్టి మధ్యాహ్నం తరువాత మాత్రమే సిబ్బంది మండల వ్యవసాయ



అధికారి కార్యాలయం రాచర్ల నందు అందుబాటులో ఉండడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు గ్రామంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

### -ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు

**గిద్దలూరు, సెప్టెంబర్11, రిపబ్లిక్ న్యూస్. ::**

అటవీ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని గిద్దలూరు ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్ వై.వి. నరసింహారావు అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక అటవీశాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అటవీ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. అమరవీరల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ సంద ర్భంగా డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు మాట్లాడుతూ విధినిర్వహణలో తమ ప్రాణాలను లెక్కచేయకుండా అటవీ అధికారులు, సిబ్బంది అసువులు బాశారని తెలిపారు. అలాంటి అమర వీరులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. విధి నిర్వాహణలో తమ ప్రాణా లతో పాటుగా అడవులను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని కోరారు. అటవీ ఉద్యోగులు విధి నిర్వహణలో అడవులను కాపాడుకోవడంలో ఎలాంటి నిర్లక్ష్యం తగదన్నారు. అడవులను సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అడవులను కాపాడుకోవడం ద్వారా మానవ మనుగడ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో సబ్ డి.ఎఫ్.ఓ శ్రీకాంత్ రెడ్డి, ఫారెస్ట్ రేంజి అధికారులు హెచ్ .జీవన్ కుమార్, బి.ఎస్.కుమార్ రాజ, బి.మధు ప్రియాంక, సౌజన్య, డీఆర్వో లు వంశీకృష్ణ,జి.రంగారెడ్డి, కె.ఆనందరావు, బిజీవి శ్రీనివాసులు, జి.రాజశేఖర్ గౌడ్, సూపరింటెండెంట్ లు డీవి నరసయ్య, ఖాజా మొహిద్దిన్, ఎఫ్ ఎస్ వోలు, ఎఫ్ బి వోలు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు అండగా సీఎం సహాయనిది

### బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు


**బాపట్ల సెప్టెంబర్ 11 (రిపబ్లిక్ న్యూస్):** అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిది అండగా నిలుస్తుందని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. పిట్లవాణిపాలెం మండలం మంతెనవారిపాలెం కు చెందిన మంతెన లక్ష్మీప్రసన్న హైదరాబాదులోని సింధు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలుకు ముఖ్యమంత్రి సహాయ నిధి



నుండి ఎల్ఓసి ను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు బాధ్యతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని మెరుగైన వైద్య నిమిత్తం వివిధ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం క్షతగాత్రులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని కూటమి ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడం తోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పనిచేస్తున్నారని ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడు తున్నాయి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు,బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

# గణేష్ శోభాయాత్రలో ఎంపీ బైరెడ్డి శభరి.

### వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ శభరి.



**నందికొట్కూరు, సెప్టెంబర్11,(రిపబ్లిక్ న్యూస్) :** గణేష్ ఉత్సవాల సందర్భంగా నందికొట్కూరు పట్టణంలో ఏర్పాటు చేసిన పలు గణేష్ విగ్రహాల వద్ద నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శభరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా సప్తగిరి

బుధవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రను ఎంపీ శభరి ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని బంగారు దుకాణ సదుపాయంలో కమిటీ అధ్యక్షులు శ్రీరాములయ్య మరియు సభ్యులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని

సూర్య నగర్, కోట వీధి, సాయిబాబా పేట, ఆత్మకూరు రోడ్డు సంఘయ్య పేట లో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహా పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం పంచముఖీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎస్ ఐ లు తిరుపాలు, సురేష్, చంద్రశేఖర్, శరత్ కుమార్ రెడ్డి లు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శ్రీరాములు ఆచారి, కమిటీ సభ్యులు ప్రసాద్, నారాయణ గౌడు, వేంకటేశ్వర ఆచారి, సుబ్రమణ్యం, అమీర్, సురేష్, రఘురామ రెడ్డి, చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ బేబీ, చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు చాంద్ బాషా, లాల్ ప్రసాద్, రాధిక, నాయకులు ఉస్మాన్ బేగ్, గూడూరు రవికుమార్ రెడ్డి, గూడూరు శివకుమార్ రెడ్డి , భీమిశెట్టి జయరామయ్య, రాజశేఖరప్ప ,మురళీధర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.



## ఇస్కాన్ అహోబిలంలోఅంగరంగ వైభవంగా రాధాష్టమి వేడుకలు .

**రుద్రవరం, సెప్టెంబర్ 11, రిపబ్లిక్ న్యూస్. ::**

మండలంలోని హరినగరం సమీపంలో ఉన్న ఇస్కాన్ అహోబిలంలో బుధవారం అంగరంగ వైభవంగా రాధాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ అహోబిలం ఇంచార్జ్ చంద్రకేశవ దాస ప్రభు

రాధా రాణి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రాధా రాణి గురించి ఉపన్యాసం కార్యక్రమం

నిర్వహించారు. ఈరోజు ఉదయాన్నే మంగళహారతి దర్శన హారతి స్పెషల్ అలంకరణ రాధా రాణి కి 10 రకాల పుష్పాభిషేకం మరియు శంకాభిషేకం 108 రకాల మహా నైవేద్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తధానంతరం వచ్చినటువంటి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.



# రసాయన ఎరువులపై రైతులకు అవగాహన సదస్సు

## విన్నూత్న ఆగ్రో టెక్ఆధ్వర్యంలో రైతు సదస్సు...



**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్:** ఆళ్లగడ్డ నియోజకవర్గంచాగలమర్రి మండలంలోనిడి. వనిపెంట గ్రామంలో బుధవారం పంటల సాగులో రసాయనిక ఎరువులు వాడడంపై విన్నూత్న ఆగ్రో టెక్ ఎల్.ఎల్.పి మార్కెట్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ బిల్లా రాజేష్ యాదవ్ , సెల్స్ ఆఫీసర్ మస్తాన్, ఫీల్డ్ అసిస్టెంట్ నాయక్ ల ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధులు రసాయన ఎరువుల వాడకం పైరైతు సదస్సును కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెట్కతులు అవగాహన లేకుండా ఇష్టం వచ్చినట్లు రసాయనిక ఎరువులు వాడటం ద్వారా ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రసాయన ఎరువులు వాడకం వల్ల క్రమక్రమంగా భూమిలో భూసారం తగ్గిపోయి, పంట దిగుబడులు తగ్గిపోతాయన్నారు . ఇది ముఖ్యంగా మానవ జంతువాళికి ముప్పును కల్పిస్తాయని పర్యావరణ కలుష్యాన్ని పెంచుతాయని అన్నారు. ఈ నేపథ్యంలో తమ సంస్థ అన్ని గ్రామాలలో రైతు సదస్సులు నిర్వహించి రైతు లకు సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులను గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు వాడడం వల్ల రైతులకు పంటలకు పెట్టె పెట్టుబడులు తగ్గిపోవడంతో పాటు అధిక దిగుబడులను సాధించ వచ్చని అన్నారు. "వినూత్న ఆగ్రో టెక్ ఎల్.ఎల్.పి" వారు రైతులకు అందించే సేంద్రీయ జీవన ఎరువులైనా "యోధ సేంద్రియ ఎరువులు, యోధ %జమీీ%, జీవన్ గోల్డ్, రైతుమిత్ర, ప్రణయ్, గ్రో హై గ్రాన్యూల్స్, గ్రో హై లిక్విడ్, డెల్టా ప్రో, తులిప్, యువరాజ్, డైనమైట్, జనని, ట్రిగర్ %××%, టర్బో %××%, కే జి ఎఫ్ 6, రోషిని, ఉజ్వల్ %××%, త్రిసూల్, ధర్మవీర్ , రత్నా, పృధ్వీరాజ్, తిరంగా, నైట్స్, త్రిలోక్, ఇగ్నిస్ 5 అవనీ న్యూట్రిన్, అవనీ గోల్డ్, అవనీ జింక్ ప్లస్ (జెడ్33%ఎస్15%), అవనీ న్యూట్రిసోల్ (కే ఎం ఎస్-22.18.20), అవనీ కాబన్, అవనీ సీ గోల్డ్ (పౌడర్/గ్రానువాల్స్) , అవనీ సీ గోల్డ్ (లిక్విడ్), అగ్ని, విభా ప్లస్, వాల్ట్, ధన్వి , వాల్ యు ప్యాక్, టిల్లరింగ్ బోస్టర్, సాయిల్ రిసువేటర్, లను పంటకు వాడి భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు తెలిపారు. "వినూత్న ఆగ్రో టెక్ఎల్.ఎల్.పి." సంస్థ గత 2 సంవత్సరాలుగా సేంద్రీయ, జీవన ఎరువులను అందిస్తున్నదని ఆయన తెలిపారు. పలు గ్రామాల్లో సేంద్రీయ జీవన ఎరువులపై రైతు అవగాహన సదస్సు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, సేల్స్ ఆఫీసర్, మస్తాన్, ఫీల్డ్ అసిస్టెంట్ నాయక్ , గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.



## మొదటి వినాయకుని నిమజ్జనం చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల సెప్టెంబర్ 11 ( రిపబ్లిక్ న్యూస్):**
వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నంద్యాల పట్టణంలో పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలను ప్రజలు ఏర్పాటు చేశారు. బుధవారం వినాయక పండగ ఐదవ రోజు కావడంతో నిమజ్జనానికి సన్నద్ధమయ్యారు ఈ సందర్భంగా నంద్యాల స్థానిక చిన్న చెరువు నందు మొదటి విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిఎన్ఎండి ఫరూక్ గారు నిమర్జనం చేశారు

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ డప్పులు, మేళ తాళాలు, రంగులు, బాణాసంచా, గణపతి పప్పా మోరియా అంటూ నిమజ్జనానికి పయనమయ్యారని . నంద్యాల చిన్న చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనానికి పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారన్నారు . ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు చెరువు కట్ట వెంబడి బారికేడ్లు ఏర్పాటు చేశారని . వినాయక విగ్రహాలను ప్రజలు వాహనాలలో చెరువు కట్ట వద్దకు తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారన్నారు . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ భాషా , మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిషా , టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర రావు , రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి రామకృష్ణారెడ్డి , గణేష్ కేంద్ర కమిటీ సభ్యులు గంగిశెట్టి విజయ్ కుమార్ , కౌన్సిలర్లు గంగిశెట్టి శ్రీధర్ గారు , శ్యామ్ సుందర్ లాల్ గ , ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చెలం బాబు , నిమ్మకాయల సుధాకర్ , మేడ మురళి , శేఖర్ తదితరులు పాల్గొన్నారు



## నంద్యాల భైర్మల్ వీధిలో గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్న ప్రసాద వితరణ చేసిన మంత్రి ఫరూఖ్



## నంద్యాలలో ప్రారంభం అయిన గణేష్ నిమజ్జన మహోత్సవ కార్యక్రమం

**నంద్యాల క్రైం, సెప్టెంబర్, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల చెరువు కట్ట వద్ద గణేష్ ఘాట్లో మొదటి విగ్రహం నిమర్జన కార్యక్రమంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పాల్గొన్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమం శాంతి యుతంగా భక్తి ఆధ్యాత్మికతతో సాగాలని ఆయన అన్నారు. గణనాధుడి నిమర్జనం కు ఎలాంటి డిజేలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ యుగంధర్ బాబు, సిఐలు మోహన్ రెడ్డి, ఎరిషా వలి, నంద్యాల ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## వెలుగోడు మండలంలో 100% పంట నమోదు పూర్తి...ఏవో



**వెలుగోడు సెప్టెంబర్ 11 (రిపబ్లిక్ న్యూస్ )** వెలుగోడు పట్టణ రైతు సేవ కేంద్రం నందు ఈ పంట ఈకేవేసి నీ బుధవారం నాడు ఏవో పవన్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగోడు మండలం లో 100% పంట నమోదు పూర్తి అయిందని తెలిపారు. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 13 వేల ఎకరాలకు గాను ఇప్పటికి సాగైనా 11860 ఎకరాలు ఈ-పంట నందు పంట నమోదు పూర్తి అయిందని తెలిపారు. రైతులు పంట నమోదుకు సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలని, ఇంకా ఎవరైనా రైతులు సాగు చేసి పంట నమోదు చేసుకొని వారు ఉంటే ఉంటే వెంటనే ఈ పంట నమోదు చేసుకోవాలని రైతులను కోరారు. సెప్టెంబర్ 19 నుండి 24 వరకు రైతు సేవా కేంద్రాల్లో ఈపంట నమోదు జాబితా ప్రదర్శన చేసి, గ్రామ సభ నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. సెప్టెంబర్ 30న తుది జాబితా ప్రచురించడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నాగమణి రామకృష్ణ పాల్గొన్నారు.

## నగళ్లపాడు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎం.ఈ.ఓ



**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్:** చాగల మర్రి మండలంలోని నగల్లపాడు గ్రామ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల విద్యాశాఖ అధికారి న్యామతుల్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల హాజరు పట్టి, విద్యా బోధన పనితీరు, మధ్యాహ్న భోజన పథకం తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థులను పాఠ్య పుస్తకాలలోని కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు విని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్దేశిత మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందుతున్నదా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి, ఉపాధ్యాయుడు దావూద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఎన్ ఎస్ ఆర్ డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థుల విరాళం.

**వెలుగోడు సెప్టెంబర్ 11 (రిపబ్లిక్ న్యూస్)** వెలుగోడు పట్టణ శ్రీ నీలం సంజీవరెడ్డి డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతాలకు కంచె ఏర్పాటుకు 1985 -1988 సంవత్సరానికి చెందిన బి.ఎ పూర్వ విద్యార్థులు విరాళం అందించారు.ఇందులో భాగంగా బుధవారం నాడు పూర్వ విద్యార్థులు ముక్కమల్ల జయరామిరెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి ,విజయ సారథి వర్మ ,మోయునుద్దీన్ కళాశాల కరస్పాండెంట్ అల్లే శంకర్ రెడ్డ ప్రిన్సిపల్ హేమలత లకు 58 వేల 500 రూపాయలు నగదును విరాళంగా అందిం చారు.వీరి చేయూత పట్ల పట్టణ ప్రజలు ,కళాశాల పూర్వవిద్యార్థులు తమ హర్షాన్ని వ్యక్తపరిచారు.



## అజంతా షూ కంపెనీ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్ష.

### జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

**కడప, సెప్టెంబరు,11 (రిపబ్లిక్ న్యూస్):-** కడప నగరంలో ఏర్పాటైన అజంతా షూ కంపెనీ దినదినాభివృద్ధి చెంది విస్తరించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆకాంక్షిస్తున్నమన్నారు.బుధవారం స్థానిక మద్రాసు రోడ్డు లోని గోకుల్ కాంప్లెక్స్ నందు ఏర్పాటుచేసిన అజంతా షూ కంపెనీ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ శివశంకర్ లో తోటి హాజరై రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ నగరంలోని అజంతా షూ కంపెనీ రిటైల్ అవుట్ లెట్ ప్రారంభించడం కోసం తాను హాజరు కావడం జరిగిందని చెప్పారు. కోరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ డాక్టర్ కె. వెంకట చలపతి, సతీమణి విజయ వారు చెన్నై సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ నందు లెదర్ ప్రాసెసింగ్ కెమికల్స్ లో రీసెర్చ్ చేసి పీహెచ్డీ కూడా తీసుకొని నాయనమ్మ గారి స్ఫూర్తితో అజంతా షూ కంపెనీ ఏర్పాటు చేయడం జరిగిందని అది దినదిన అభివృద్ధి చెంది విస్తృతంగా విస్తరించాలని అన్నారు. ఈ షూలు మంచి యురేపియన్ నాణ్యతతో తయారు చేయడం జరుగుతోందని, సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండే విధంగా సరసమైన ధరకుఅందిం చాలనికోరుతు న్నామన్నారు. వైయస్సార్ జిల్లా కడప కొప్పర్తి నందు ఒక మంచి ఇండస్ట్రియల్ పార్కును 3600 ఎకరాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆ ప్రాంతంలో లెదర్ ప్రాసెసింగ్ యూనిట్ ను చేయదలిచితే సహాయ సహకారాలంది స్తామన్నారు. ఈ అజంతా షూ కంపెనీ వ్యాపారం దినదినాభివృద్ధి చెంది వారు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షిస్తు న్నానన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అజంతా షూ కంపెనీ షో రూమ్ ను రిబ్బన్ కత్తిరించి, జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం అజంతా షూ కంపెనీ లో షూ లను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఇంఛార్జి కమిషనర్ రాకేష్ చంద్ర, కోరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ డాక్టర్ కె. వెంకట చలపతి, సతీమణి విజయ, చీఫ్ సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, ఎం. డి. కె.వి. రమేష్, మేనేజింగ్ పర్ట్నర్ కె. విజయ్, డైరెక్టర్ గోపి కృష్ణ, ప్రజాప్రతినిధి కందుల శకుంతల తదితరులు పాల్గొన్నారు.



## వినాయక మంటపంలో పబ్బతి వేణుగోపాల్ దంపతులకు సన్మానం



**నంద్యాల సెప్టెంబర్ 11 ( రిపబ్లిక్ న్యూస్):**
పట్టణంలోని పద్మావతి నగర్ నందలి పిఏవి టవర్స్ అపార్ట్మెంట్ నందు వినాయక మండపంలో అపార్ట్మెంట్ వాసులు వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా వినాయకుని ఉత్సవాలలో సహాయ సహకారాలు అందించిన పిఏవి గ్రూప్ చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ సతీమణి ప్రముఖ అడ్వకేట్ అపర్ణ దంపతులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యుడు పసుపుల రవి మాట్లాడుతూ పట్టణంలో సేవా కార్యక్రమంలో పబ్బతి వేణుగోపాల్ ఎప్పుడు ముందు వరుసలో ఉండి ఆర్థిక సాయం చేస్తుంటాడని కొనియాడారు అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతగా నిలిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు

## శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ కేంద్రంలో నిమజ్జన వేడుకలు.





**నంద్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 11, రిపబ్లిక్ న్యూస్ ::**
నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీలోని శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ లో కొలువైన గణనాథుని నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ లో కొలువైన విఘ్నేశ్వరుడికి చివరి రోజు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో శ్రీ రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత డాక్టర్ పి. దస్తగిరి రెడ్డి, డైరెక్టర్లు పి. మౌలాలి రెడ్డి, పి. షేక్షావలి రెడ్డి పాల్గొని అనంతరం నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన ఏర్పాట్లను సెంటర్ విద్యార్థులు పర్యవేక్షించారు. గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ నుండి బయలుదేరిన గణనాథుడు భక్తిశ్రద్ధలతో ముందుకు సాగారు. బ్యాంక్ కోచింగ్ విద్యార్థులు వెంటరాగా గణనాథున్ని నంద్యాల చిన్న చెరువు కట్ట వద్ద ఉన్న ఘాట్ లో వినాయకున్ని నిమజ్జనం చేశారు.



## లాలు భాష కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన అహోబిలం గణేష్ ఉత్సవ కమిటీ

**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్:** ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామంలో నిన్న తెలుగు కాలువలో పడి మరణించిన బాలుడు లాలు భాష కుటుంబ సభ్యులకు శ్రీ లక్ష్మి నృసింహ స్వామి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు.

కమిటీ తరుపున 10 వేలు,దేవస్థానం ఉద్యోగి రాంభూపాల్ రూ.5 వేలు మిగత సభ్యులు 15 వేలు మొత్తం 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసారు.

ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులు రాంభూపాల్, సోక్కం శ్రీనివాసులు,సానే రామాంజనేయులు, డిష్. నాగేంద్ర, అనకాల నరేష్, సానే.సురేష్, నవీన్, గోపాల్,ప్రసాద్, సోక్కం.ప్రేమ్ కుమార్, సోక్కం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



## వరద బాధితుల కోసం విరాళాల సేకరణ


**బండి ఆత్మకూరు,సెప్టెంబర్ 11,(రిపబ్లిక్ న్యూస్):-** విజయవాడ ప్రాంతంలో వరదల దాటికి అతలాకుతలమైన వరద బాధితుల సహాయార్థం తెలుగుదేశం,జనసేన నాయకులు విరాళాల సేకరణ చేపట్టారు.బుధవారం మండలంలోని భోజనం గ్రామంలో శ్రీశైలం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు అల్లవరం మల్లేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి,జనసేన నాయకులు బాలకృష్ణ,దూదేకుల చాంద్ బాషాలు ఇతర నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు. వరద బాధితుల మీ వంతు సహకారంగా ఏదైనా సాయం చేయాలని వారు విన్నవించారు.దీంతో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారు.అలాగే మండలంలోని పలు గ్రామాల్లో టిడిపి,జనసేన నాయకులతోపాటు సిపిఎం నాయకులు వేరువేరుగా విరాళాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు మౌలాలి,అబ్దుల్లా, కార్తీక్,రషీద్ తదితరులు పాల్గొన్నారు.



## 14. 52 లక్షల ఎరువుల అమ్మకాలు నిలిపివేత.



**మహానంది, సెప్టెంబర్ 11, రిపబ్లిక్ న్యూస్. ::** 14. 52 లక్షల ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు నంద్యాల రూరల్ ఏ డి ఏ రాజశేఖర్ బుధవారం పేర్కొన్నారు. మండలంలోని గాజులపల్లె గ్రామంలో ఉన్నటువంటి దీప్తి మరియు గఫారియా పెస్టిసైడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపుల్లో 47. 8 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి ఎరువులు అమ్మకాలు నిలిపివేసినట్లు తెలిపారు. స్టాకు రిజిస్టర్ మరియు ఈ పాస్ మిషన్ ద్వారా లెక్కల్లో తేడా ఉన్నట్లు ఏడిఏ తెలిపారు. ఎరువులు అమ్మకాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేవని చట్ట విరుద్ధంగా చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని షాపు యజమానులను హెచ్చరించారు. షాపుల్లో ధరల పట్టికలను మరియు స్టాకు వివరాలను ప్రతిరోజు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మహానంది మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇస్కాన్ అహోబిలంలో అంగరంగ వైభవంగా రాధాష్టమి వేడుకలు..



**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్ :** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో రుద్రవరం మండల పరిధిలోనిమండలంలోని హరినగరం సమీపంలో ఉన్న ఇస్కాన్ అహోబిలంలో బుధవారం అంగరంగ వైభవంగా రాధాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ అహోబిలం ఇంచార్జ్ చంద్రకేశవ దాస ప్రభు

రాధా రాణి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రాధా రాణి గురించి ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈరోజు ఉదయాన్నే మంగళహారతి దర్శన హారతి స్పెషల్ అలంకరణ రాధా రాణి కి 10 రకాల పుష్పాభిషేకం మరియు శంకాభిషేకం 108 రకాల మహా నైవేద్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తదనంతరం వచ్చినటువంటి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనులను గడువులోగా పూర్తి చేయండి.

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, సెప్టెంబర్ 11, రిపబ్లిక్ న్యూస్ ::**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీవోలు, ఎపిడిలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్, 100 రోజుల పనిదినాల కల్పన, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ పనులు, సంస్థాగత ప్లాంటేషన్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఫారం పాండ్స్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, పశుసంపద షెడ్లు, ట్రెంచ్ పనుల ప్రగతి లక్ష్యాలపై డ్వామా పిడి రామచంద్రారెడ్డితో కలసి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవోలు, ఎపిడిలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. లేబర్ బడ్జెట్ మొబలైజేషన్ లో జూపాడుబంగ్లా, కొత్తపల్లి, మిడుతూరు, పాములపాడు తదితర మండలాలు లక్ష్యసాధనలో వెనుకబడి వున్నాయని మూడు రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్లాంటేషన్ కు సంబంధించి మిడుతూరు, ప్యాపిలి, డోన్, బేతంచర్లలో లక్ష్యాన్ని చేరుకోలేదని ఈ వారంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫారం పాండ్ల త్రవ్వకంలో కొలిమిగుండ్ల,



ఉయ్యాలవాడ తదితర మండలాల్లో పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి ఏపీడీలు ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తూ పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు.

## బై బై గణేశా....

### ఆళ్లగడ్డలో ఘనంగా గణనాధులకు వీడ్కోలు...

**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్:**

ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం రాత్రి గణేష్ నిమజ్జోన మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఐదు రోజుల పాటు పూజలు అందుకున్న 70 మందికి పైగా వినాయకులు అత్యంత కోలాహలం, శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వకులా నదిలో నిమజ్జనం గావించారు. ముందుగా సాయంత్రం పట్టణంలోని విగ్రహాలన్ని గణేష్ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలికి ఊరేగింపుగా చేరుకున్నాయి. అనంతరం అక్కడినుండి పడకండ్ల సమీపంలోని వక్కిలేరు ( వకులా నది) ఒడ్డుకు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రేన్ల సహాయంతో మున్సిపల్ సిబ్బంది గణేష్ కమిటీ సమన్వయంతో విగ్రహాల నిమజ్జనం జరిగింది. తెల్లవారుజాము వరకు నిమజ్జనోత్సవం జరగనున్నట్లు గణేష్ కేంద్ర కమిటీ సభ్యులు తెలిపారు.

గణేష్ లడ్డూ వేలం పాటలో 15 వేలు ఆదాయం..

ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో గణేష్ శోభాయాత్ర సందర్భంగా ప్రత్యేక వేదికను కేంద్ర కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణేష్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ మాట్లాడుతూ గత ఏడాదికన్నా ఈ ఏడాది మరింత కట్టుదిట్టంగా ఉత్సవాలు నిర్వహించడం జరిగిందని ఈ ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి పోలీస్ శాఖ సిబ్బంది, మున్సిపల్ , ఆరోగ్యశాఖ,రెవెన్యూ అధికారులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి శాలలో ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక స్వామికి నైవేద్యంగా సమర్పించిన లడ్డు వేలం పాటలను వాసవి సేవాదళ్ సభ్యులు నిర్వహించారు. ఈ వేలం పాటలలో డిగ్రీ కళాశాల లెక్చరర్ మధు శేఖర్ రు.15 వేలకు అత్యధికంగా వేలంపాడి లడ్డూను దక్కించుకున్నారు.

భారీ పోలీసు బందోబస్తు..

ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన గణేష్ నిమజ్జోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సబ్ డివిజన్ పరిధిలోని కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు, సిరివెళ్ల సిఐ వంశీధర్, రూరల్ సీఐ కంబగిరి రాముడు, టౌన్ సీఐ చిరంజీవి, ఎస్సైలు పోలీస్ సిబ్బంది తో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండల తహసిల్దార్ జ్యోతి రత్నకుమారి, మున్సిపల్ ఏఈ సురేంద్ర నాథ్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది బి నీలకంతేశ్వరం, మధు మురళీధర్, విద్యుత్ శాఖ ఏడి ఈ రవికాంత్ చౌదరి, త్రినేత్ర మోహన్ రెడ్డి,గణేష్ కేంద్ర కమిటీ సభ్యులు గ్యాస్ పుల్లయ్య, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, ఆర్ఎస్ఎస్ ప్రముఖ చల్లు చలమల రామకృష్ణ, సుధాకర్ రావు, అపుస్మ నంద్యాల డివిజన్



ప్రెసిడెంట్ అమీర్ భాష మున్సిపల్ రెవెన్యూ ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.







## బొజ్జ గణపయ్యకు బై బై

### నంద్యాలలో కన్నుల పండుగగా వినాయకుని నిమజ్జన వేడుకలు

### ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల ముందస్తు ఏర్పాట్లు

### భక్తులతో కళకళలాడిన చెరువుకట్ట వినాయకఘాట్‌లు

పట్టణంలో వాడ వాడలో వెలసిన బొజ్జ గణపయ్యకు భక్తులు ఘనంగా బై బై చెప్పి బుధవారం వినాయక నిమజ్జన వేడుకలను భక్తి పారవశ్యంతో ముగించారు.ఉదయం నుండి పట్టణంలోని అన్ని వార్డుల నుండి గత ఐదు రోజులుగా పూజలు అందుకుంటున్న వినాయకునికి చివరి పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం వినాయకునితో పాటు భక్తులు పవిత్ర ప్రసాదంగా భావించి పూజలు అందుకుంటున్నవినాయకుని మహా లడ్డును వేలం పాట కార్యక్రమంను నిర్వహించారు. గత సంవత్సరం కొన్ని చోట్ల రూ. రెండు లక్షల కు పైగా ఈ వినాయకుని మహా ప్రసాద లడ్డును వేలంలో భక్తులు దక్కించుకున్నారు. ఈసారి కూడా కొన్ని వినాయకుని మంటపాలలో అంతకు మించి ఎక్కువగా పాట పాడి ఈ వినాయకుని లడ్డును భక్తులు దక్కించుకున్నట్లు సమాచారం. లడ్డు వేలం పాట ముగిసిన అనంతరం ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తున్ని లడ్డుతో పాటు ఊరేగింపుగా తీసుకెళ్లడం మంటపాలలో సాంప్రదాయంగా వస్తున్నది. మధ్యాహ్నం నుండి భోజనాల అనంతరం వినాయకుని నిమజ్జనంకు యువత, మహిళలు నృత్యాలు చేస్తూ విగ్రహాన్ని పురవీధుల గుండా కొలాహలంగా భక్తులు కదిలిరాగా చెరువుకట్ట వినాయకఘాట్ వద్దకు చేరుకోవడానికి విగ్రహానికి సుమారు 5 నుండి 8 గంటల సమయం పట్టింది. దారి పొడుగునా శ్రీ గణేష్ ఉత్సవ కేంద్ర సమితీ ఆధ్వర్యంలో సభ్యులు మంచినీళ్ళు, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. గాంధీ చౌక్ వద్ద సమితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపం వద్ద చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పబ్బతి వేణుగోపాల్ కు సన్మానం

గణేష్ కేంద్ర సమితీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి సహకరించిన ప్రముఖులుబిల్డర్ పిఏవిగ్రూప్ చైర్మెన్ పబ్బతి వేణుగోపాల్ ను



న్యాయశాఖమంత్రి ఎన్ఎండిఫరూఖ్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిలు సన్మానించారు. ఘాట్ వద్ద తొక్కిసలాట జరుగకుండా అధికారులు ముందస్తుగా పోలీసులను, రెవెన్యూ సిబ్బంది విధులను నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున 3 గంటల వరకు నిమజ్జన వేడుకలు నిర్వహించారు.

## స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు..

**అమరావతి:** స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ను రద్దు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019ఎన్నికల తర్వాత సెబ్‌ను ఏర్పాటు చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దానికి సంబంధించిన 12జీవోలను రద్దు చేస్తూ తాజాగా సీఎం చంద్రబాబు సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. సెబ్ ఏర్పాటుకు ముందు ఎక్సైజ్ శాఖలో 6,274మంది సిబ్బంది ఉండేవారు. వారిలో 70శాతం అంటే 4,393మందిని అప్పటి ప్రభుత్వం సెబ్ విభాగానికి కేటాయించింది. దీంతో వారంతా ఎక్సైజ్ శాఖకు అనుబంధంగా పని చేస్తున్నారు. తాజా ఉత్తర్వులతో వారంతా రిలీవ్ కానున్నారు.

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దుకు ఇప్పటికే మంత్రివర్గం ఆమోదం తెలపగా.. అందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు విడుదల చేశారు. సెబ్ సిబ్బంది, వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులంతా మాతృశాఖల్లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు వెలువడ్డాయి. వీరంతా ఎక్సైజ్ కమిషనర్ నియంత్రణ, పర్యవేక్షణలో పని చేయనున్నారు. అలాగే ఐజీ ర్యాంకు కలిగిన ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు కానుంది. సెబ్‌కు కేటాయించిన ఫర్నిచర్, వాహనాలు, కంప్యూటర్లు, అద్దె భవనాలను సైతం ఎక్సైజ్ శాఖకు అప్పగించాలని ఎన్డీయే సర్కార్ ఆదేశించింది

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com